సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 7 । అక్టోబర్ । 2023



సోమశిలలో 29.387 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 29.387 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయంలో 91.430 మీటర్ల నీటిమట్టం ఉంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.58,300
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,247
3శాతం జీఎస్టీతో	రూ.5,404
నవర (8గ్రా)	రూ.43,232

గరిష్టం/కనిష్టం
38.7 /25.8

వాతావరణం

శుక్రవారం గాలిలో తేమ 56 శాతం ఉంది. శనివారం ఎండతీవ్రత, ఉష్ణోగ్రతలు, ఉక్కపోత బాగానే ఉంటాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

అవార్డు గ్రహీతకు సత్కారం



ఏడీఏ రాజ్‌కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ముత్తుకూరు: ఇందుకూరుపేట సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు రాజ్‌కుమార్‌కు జాతీయ స్థాయి అవార్డు రావడం గర్వంగా ఉందని స్టేట్ హార్టీకల్చర్ బోర్డు సభ్యుడు దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం మండల వ్యవసాయ శాఖ అధికారి జ్యోత్స్నరాణి అధ్యక్షతన జరిగిన సభలో మండల ఎరువులు, పురుగుమందుల డీలర్లు రాజ్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రోన్ టెక్నాలజీపై అవగాహన కల్పించడం, నానో ఎరువుల వినియోగం, ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానాన్ని రైతులకు అందించడం వల్లనే అవార్డు అందచేశారన్నారు. ఏఏటీ కమిటీ చైర్మన్ పోచారెడ్డి చెంగారెడ్డి, రైతు శిక్షణ కేంద్రం డీడీఏ శివన్నారాయణ, ఇఫ్కో ఎండీ నారాయణరావు, వీఏఏలు పాల్గొని ఏడీఏని ఘనంగా సత్కరించారు.

వైద్యసేవలపై ఆర్డీఓ ఆరా



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ మలోల

నెల్లూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని నెల్లూరు ఆర్డీఓ మలోల అన్నారు. నెల్లూరు రూరల్ మండలంలోని అమంచర్లలో శుక్రవారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. వైద్య సేవలను పరిశీలించారు. శిబిరానికి వచ్చిన వారితో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. ప్రతి ఒక్కరికి ఆరోగ్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. రూరల్ ఎంపీపీ విజయకుమార్, రూరల్ ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శైలేంద్రకుమార్, సౌత్‌మోపూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు రవీంద్రనాథ్‌రెడ్డి, పలువురు అధికారులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. అమంచర్ల పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు శిబిరానికి తరలివచ్చారు. వైద్య పరీక్షల అనంతరం ఉచితంగా మందులను అందజేశారు.

భైరవకోనలో జిల్లా అధికారుల పూజలు



డీపీఓ సుస్మిత, బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలకు అమ్మవారి వస్త్రాలు అందజేస్తున్న ఆలయ అర్చకులు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం భైరవకోనలో నెల్లూరు జిల్లా అధికారులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. నెల్లూరు జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) సుస్మిత, బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి, డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (డీటీసీ) చంద్ర, కావలి ఆర్డీఓ సుధాకర్‌రెడ్డి, ఆత్మకూరు ఎంవీఐ రాములు, గోపీనాయక్, రాంబాబు, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటయ్య తదితరులు జలపాతాన్ని సందర్శిచారు. అనంతరం భైరవేశ్వరస్వామి, త్రిముఖ దుర్గాదేవి, నగరేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ చైర్మన్ సిద్దు రమణారెడ్డి, ఈవో నర్రా నారాయణరెడ్డిల సూచన మేరకు వేద ఆశీర్వచనం చేసి వారికి తీర్థప్రసాదాలు, స్వామివార్ల వస్త్రాలను అందజేశారు.

నేడు జిల్లాస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు

ఆత్మకూరు: జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్‌లో భాగంగా అండర్–14, 17లలో బాలబాలికలకు బాల్‌బ్యాడ్మింటన్, నెట్‌బాల్ టోర్నమెంట్ పోటీలు, ఎంపికలు శనివారం ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎస్.విజయ, ఆత్మకూరు క్రీడల ఆర్గనైజింగ్ కార్యదర్శి తిరుపతయ్య శుక్రవారం తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికైన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు కురిచేటి గోవిందమ్మ. ఈమెది అయ్యవారిపల్లి గ్రామం. ఆ గ్రామ సర్వే నంబరు 332–2లో 2008లో ప్రభుత్వం 1.39 ఎకరాలకు డి–ఫారం పట్టా ఇచ్చింది. అప్పటి నుంచి ఆమె ఈ భూమిని సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో ఇటీవల వెబ్‌ల్యాండ్‌లో ఆమె పేరు మారి వేరే పేరు వచ్చింది. దీంతో రైతుభరోసా నగదు ఆగిపోయింది. ఈ విషయం జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే సంబంధిత అధికారులను పిలిచి వెబ్‌ల్యాండ్‌లో మార్పులు చేసి ఆమె పేరు నమోదు చేయాలని ఆదేశాలిచ్చారు. ఈ సమస్యపై ఆమె మరలా నా వద్దకు వస్తే కఠిన చర్యలుంటాయని రెవెన్యూ అధికారులను హెచ్చరించారు.

సీతారామపురం స్వామిచెరువు షట్టర్ లీకేజీ అయి నీరంతా వృథాగా పోతోందని స్థానికులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీంతో స్పందించిన కలెక్టర్ ఇరిగేషన్ ఎస్ఈ కృష్ణమోహన్‌ను పిలిచి క్షేత్రపరిశీలన చేసి అవసరమైతే వారం రోజుల్లోపు మరమ్మతులు చేసి నీటి వృథాను అరికట్టాలని ఆదేశాలిచ్చారు. వెంటనే ఇరిగేషన్ అధికారులు ఆ చెరువును పరిశీలించి నీరు లీకేజీ అవుతున్నట్లు నిర్ధారించుకొని కలెక్టర్‌కు తెలియజేశారు. వెంటనే ఆయన కొత్త షట్టర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేశారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తులు సీతారామపురానికి చెందిన పలువురు రైతులు. వీరు జాతీయ రహదారి భూసేకరణ నష్టపరిహారంలో ఉన్న వ్యత్యాసాలను సరిచేసి న్యాయమైన పరిహారం అందించాలని కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్ వెంటనే సంబంధిత నివేదికను తనకు పంపాలని ఆర్డీఓ కరుణకుమారిని ఆదేశించారు. వీలైనంత త్వరగానే న్యాయమైన నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. దీంతో వారు సంతోషం వ్యక్తం చేశారు.

ఎక్కడి సమస్యకు అక్కడే పరిష్కారం

పల్లెల చెంతకు 'జగనన్నకు చెబుదాం'

- కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన
- సీతారామపురంలో 295 పైగా అర్జీలు
- ప్రజా వాణిని ఓపిగ్గా విన్న కలెక్టర్ హరినారాయణన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను ఎక్కడికక్కడ ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరించేందుకు జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ప్రస్తుతం జిల్లాస్థాయిలో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని మారుమూలలో ఉన్న మండల కేంద్రాలకు సైతం విస్తరింపజేసింది. జిల్లా అధికారులు మండలాలకు వచ్చి ప్రజా సమస్యలు తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కరించే ఈ వినూత్న కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా కొనసాగుతోంది.

ఉదయగిరి/సీతారామపురం: గత నెల 13న ప్రారంభమైన జగనన్నకు చెబుదాం సరికొత్త కార్యక్రమం దగదర్తి, రాపూరు, ఇందుకూరుపేట, చేజర్ల, పొదలకూరు, కావలి మండలాలలో పూర్తయింది. జిల్లా కేంద్రానికి 130 కిలోమీటర్ల దూరంలో ఉన్న సీతారామపురం మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. అధిక సంఖ్యలో అర్జీదారులు వచ్చి సమస్యలను కలెక్టర్ కె.హరినారాయణన్‌కు విన్నవించుకున్నారు. వివిధ సమస్యలపై 295 మందికి పైగా అర్జీలిచ్చారు. అర్జీలను కలెక్టర్ స్వయంగా పరిశీలించి అక్కడికక్కడే పరిష్కరించే ప్రయత్నం చేశారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని కొన్ని సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమయ్యాయి.



ఓ వృద్ధుని సమస్యను ఆసక్తిగా వింటున్న కలెక్టర్ హరినారాయణన్

ఎప్పటికప్పుడు మార్పులు

ప్రజా విజ్ఞప్తుల స్వీకరణ కార్యక్రమంలో ప్రభుత్వం ఎప్పటికప్పుడు కొత్త మార్పులు చేస్తూ వస్తోంది. ఇందులో భాగంగా మారుమూల ప్రాంతాలలో చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు ఎంతో మేలు చేకూరుతోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏ చిన్న సమస్య ఉన్నా కలెక్టరేట్‌కు తరలివెళ్లే దుస్థితి నుంచి తమ సొంత మండలాలకే జిల్లా అధికారులు వచ్చి అప్పటికప్పుడే ప్రజల సమస్యలు పరిష్కరించే సరికొత్త కార్యక్రమం సత్ఫలితాలిస్తోంది. ఈ కార్యక్రమం ఏదో ఒక ప్రహసనంలా కాకుండా ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు పర్యవేక్షణ ఉండటంతో అధికారులు అర్జీలపై ప్రత్యేక దృష్టిపెడుతున్నారు. దీంతో మారుమూల గ్రామాలలోని ప్రజలు వ్యయ ప్రయాసలు లేకుండానే తాముండే ప్రాంతాలలోనే జిల్లా అధికారులకు సమస్యలు చెప్పుకొని పరిష్కారం పొందుతున్నారు.

ప్రజల నుంచి విశేష స్పందన

సీతారామపురం మండలంలోని తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. ముఖ్యంగా రెవెన్యూ సమస్యలు, ఇళ్ల పట్టాలు మంజూరు కోసం ఎక్కువ అర్జీలొచ్చాయి. కలెక్టర్ వీటిపై స్థానిక అధికారులకు దిశా నిర్దేశం చేస్తూ నిర్ణీత వ్యవధిలో సమస్యలు మొత్తం పరిష్కరించాలని ఆదేశాలిచ్చారు. పరిష్కరించగలిగే సమస్యలపై మళ్లీ కార్యార్థులు తన వద్దకు రాకుండా చూసుకోవాలని అధికారులకు తెలిపారు. కలెక్టర్ ఎంతో ఓపిగ్గా అర్జీలు స్వీకరిస్తూ అర్జీదారులు చెప్పే ప్రతి సమస్యలను క్షుణ్ణంగా వింటూ వారి సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేశారు. దీంతో అర్జీదారులు కూడా ఎంతో సంతృప్తి చెందారు. కలెక్టర్‌తో పాటు జేసీ కూర్మనాథ్, ఆత్మకూరు ఆర్డీఓ కరుణకుమారి కూడా అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీపీఓ సుస్మితా రెడ్డి, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు సాంబశివారెడ్డి, వెంకట్రావు, సర్వే రికార్డుల ఏడీ హనుమాన్‌ప్రసాద్, సీపీఓ ఏఎస్.రాజు, నుడా వైస్ చైర్మన్ బాపిరెడ్డి, సమాచార శాఖ డీడీ సదారావు, స్థానిక తహసీల్దార్ ఎం.సుధాకర్, జడ్పీటీసీ చెరుకుపల్లి రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు చింతంరెడ్డి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'గడప గడపకు' విజయోత్సవం



భారీ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- ఈ కార్యక్రమం సీఎం మానసపుత్రిక
- 204 రోజుల్లో 1.12 లక్షల గడపలు పూర్తి
- ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మానస పుత్రిక అని కోవూరు శాసనసభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. భగవంతుని ఆశీర్వాదంతో ఈ కార్యక్రమం దిగ్విజయంగా పూర్తిచేశానని అన్నారు. కోవూరు నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన సందర్భంగా మండలంలోని మొత్తలు గ్రామంలో విజయోత్సవ సంబరాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022 ఆగస్టు 1న జొన్నవాడ కామాక్షమ్మ తల్లి ఆశీస్సులతో నియోజవర్గంలో ఈ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని గుర్తు చేశారు. మండుటెండలను, ఎడతెరిపి లేని వర్షాన్ని సైతం లెక్కచేయకుండా 204 రోజులపాటు అలుపెరుగని కఠోర దీక్షతో మహాయజ్ఞంలా 1.12 లక్షల గడపలను దిగ్విజయంగా పూర్తి చేశామన్నారు. నియోజకవర్గంలోని 86 సచివాలయాల పరిధిలో ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున రూ.17.20 కోట్లతో రోడ్లు, డ్రైన్‌లు, కరెంటు పనులు వంటివి చేపట్టామన్నారు. ఈ సుదీర్ఘ ప్రయాణంలో నన్ను ఆదరించి, అభిమానించి మీ వెంట మేమున్నామని వెన్ను తట్టి ప్రోత్సహించిన కోవూరు నియోజకవర్గ ప్రజలకు, అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి ముందు చూపుతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారని, దేశంలో ఎక్కడ ఇలాంటి కార్యక్రమం లేదన్నారు. ఎమ్మెల్యేలను నేరుగా ప్రజల వద్దకే పంపించి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకొని, వారి సమస్యలను విని పరిష్కరించాలని ఆదేశించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని కొనియాడారు. భవగంతుని ఆశీర్వాదంతో ఈ కార్యక్రమం పూర్తి చేశానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తొలుత 25 కేజీల భారీ కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ శ్రీహరికోట జయలక్ష్మి, డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు, డైరెక్టర్ గునుపాటి సురేష్‌రెడ్డి, డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, బుచ్చి నగర పంచాయతీ చైర్మన్ మోర్ల సుప్రజ, నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు, నాయకులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం

- అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- వ్యవసాయశాఖ మంత్రి కాకాణి



రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న మండల ప్రజా పరిషత్ పాఠశాలలో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని శుక్రవారం మంత్రి కాకాణి పరిశీలించారు. తొలుత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్, ల్యాబ్ టెస్టింగ్ సెంటర్, స్పాట్ రిజిస్ట్రేషన్, మందుల పంపిణీ కౌంటర్‌ను పరిశీలించి రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా పేదలందరికీ సంపూర్ణంగా ఉచిత వైద్య సేవలు అందించాలనే ఆలోచనతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని కొనియాడారు. గ్రామాల్లోనే ఉచితంగా కార్పొరేట్ వైద్య సేవలు అందిస్తుండటంతో ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని చెప్పారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి కాకాణి పరిశీలించి గర్భిణీ స్త్రీలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను, రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో వసుమతి, ఎంపీడీవో వెంకటరమేష్, వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, సర్పంచ్ డబ్బుగుంట వెంకమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరుగుంట ప్రభాకర్‌రెడ్డి, కుంకాల ఏడుకొండలు, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పరిపాలన

మారుమూలనున్న గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగుతోందని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కురిచెర్లపాడు పంచాయతీ పరిధిలో రూ.3.50 కోట్లతో నిర్మించిన సచివాలయ భవనం, మినరల్ వాటర్ ప్లాంటు, సీసీ రోడ్లు, డ్రైన్లను మంత్రి కాకాణి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన ప్రతి సేవలను గ్రామాల నుంచి బయటకు వెళ్లకుండా సచివాలయ వ్యవస్థ ద్వారా అందిస్తున్నామని చెప్పారు. సర్వేపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి గురించి మాట్లాడే దమ్ము, ధైర్యం సోమిరెడ్డికి ఉందా అని మంత్రి ప్రశ్నించారు. సర్వేపల్లి నియోజకవర్గంలో తన హయాంలో అధిక నిధులు వెచ్చించామని పేర్కొన్నారు. ఒక్క కురిచెర్లపాడు గ్రామంలోనే రూ.5.84 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేయించడం జరిగిందని తెలియజేశారు. భూములు సాగు చేసుకుంటున్న 184 మంది రైతులకు 286 ఎకరాలకు సంబంధించి పట్టాల పంపిణీకి రంగం సిద్ధం చేశామని, త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ కనుపూరు కోదండ రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, ఎంపీటీసీ వడ్లమూడి ప్రభావతి, సర్పంచ్ అక్బర్‌బాషా, వడ్లమూడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతు పక్షపాతి స్వామినాథన్



స్వామినాథన్, నాగేంద్రనాథ్ చిత్రపటాలకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

జలదంకి: భారతదేశ హరిత విప్లవ పితామహుడు, రైతుల పక్షపాతి డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ అని రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చిరసాని కోటిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బ్రాహ్మణక్రాక రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయాధికారిణి అధ్యక్షతన డాక్టర్ స్వామినాథన్, రాష్ట్ర రైతాంగ సమాఖ్య అధ్యక్షుడు యెర్నేని నాగేంద్రనాథ్‌ల మృతికి సంతాప సభ ఏర్పాటు చేసి నివాళులు అర్పించారు. రైతు సంఘాల సమాఖ్య కావలి డివిజన్ అధ్యక్షుడు ఎం.మాలకొండారెడ్డి, ఏఈఓ మునెమ్మ, వీఏఏ స్వాతి, రైతు నాయకులు పాల్గొన్నారు.

నాణ్యమైన దిగుబడులకే గిట్టుబాటు ధరలు

- పొగాకు బోర్డు రీజనల్ మేనేజరు లక్ష్మణరావు



పొగాకు రైతుల అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న రీజనల్ మేనేజరు లక్ష్మణరావు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): పొగాకు బోర్డు సూచనలకు అనుగుణంగా పరిమిత విస్తీర్ణంలో పొగాకు పంట సాగు చేపట్టాలని తద్వారా నాణ్యమైన దిగుబడులతో పాటు గిట్టుబాటు ధరలు కూడా పొందవచ్చనని పొగాకు బోర్డు రీజనల్ మేనేజరు లక్ష్మణరావు పేర్కొన్నారు. మర్రిపాడు మండలం డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో శుక్రవారం పొగాకు రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయంగా పొగాకు సాగు విస్తీర్ణాన్ని బట్టి వేలం కేంద్రాల్లో రైతులకు ధరల దక్కే అవకాశం ఉందని తెలిపారు. ఈ కారణంగా ఒక్కో బ్యారెన్ రైతు 3,650 కేజీలకు మించకుండా పొగాకును పండించుకోవాలన్నారు. కంది, మినుము, శనగ, తదితర ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడం ద్వారా రైతులు లాభాలు గడించవచ్చన్నారు. కేవీకే శాస్త్రవేత్త శివజ్యోతి మాట్లాడుతూ అంతర్జాతీయంగా పొగాకు పంట సాగుకు ఆంక్షలు ఉన్నాయని, జొన్న, సజ్జ, రాగి లాంటి చిరుధాన్యాలు, వేరుశనగ, ఆయిల్‌పామ్ లాంటి ఆదాయం వచ్చే పంటలు సాగు చేయాలని సూచించారు. మర్రిపాడు మండల వ్యవసాయ అధికారి రామ్మోహన్, డీసీపల్లి పొగాకు వేలం నిర్వహణ అధికారి రాజశేఖర్, ఏఆర్ఎస్ శాస్త్రవేత్త వెంకటేశ్వర రావు తదితరులు తమ ప్రసంగాల్లో రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ జట్టు శిక్షణ శిబిరం ప్రారంభం



శిక్షణ-శిబిరంలో పాల్గొన్న వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులు

- వివిధ జిల్లాలకు చెందిన 22 మంది ఎంపిక

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టు శిక్షణా శిబిరాన్ని శుక్రవారం నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ప్రారంభించారు. ఇటీవల నెల్లూరులో జరిగిన రాష్ట్ర అంతర్ జిల్లాల ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్న వివిధ జిల్లాలకు 22 మందిని ఈ శిక్షణా శిబిరానికి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఈ ఎంపికైన క్రీడాకారులకు ఈనెల 10వ తేదీ వరకు కోచ్‌లు పాండురంగారావు, కృష్ణారెడ్డిల ఆధ్వర్యంలో శిక్షణ ఉంటుందన్నారు. రాష్ట్ర, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఈ శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ శిక్షణా శిబిరంలో ఎంపికైన తుది జట్టు ఈనెల 13వ తేదీ నుంచి మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో జరిగే జాతీయ సీనియర్ నేషనల్ చాంపియన్‌షిప్ సంతోష్ ట్రోఫీ ఏపీ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి ఉమాశంకర్, కోచ్ సాయి కిరణ్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

12న స్క్వేమార్షల్ ఆర్ట్స్ పోటీలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఈనెల 12, 13వ తేదీల్లో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్–14, అండర్–16, అండర్–17 బాలబాలికలకు జిల్లా స్థాయి స్క్వేమార్షల్ ఆర్ట్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు స్క్వేమార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వి.ఆదినారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని క్రీడాకారులందరూ పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఇతర వివరాలకు 8297471976 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి



దీఈ శ్రీహరిగోపాల్‌ను అడిగి గృహ నిర్మాణాల పురోగతిని తెలుసుకుంటున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

• ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి

నెల్లూరు (దర్గామిట్ట) : ఆత్మకూరు నియోజకవర్గంలోని వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన నెల్లూరులోని తన నివాసంలో గృహ నిర్మాణాలపై హౌసింగ్ డీఈ శ్రీహరిగోపాల్‌తో సమీక్షించారు. తొలుత గృహ నిర్మాణాల పురోగతిని ఎమ్మెల్యేకు డీఈ వివరించారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 7,878 జగనన్న పక్కాగృహాలు మంజూరయ్యాయని తెలిపారు. ఆత్మకూరు పట్టణం 2,030, రూరల్ 599, అనంతసాగరం 1,027, ఏఎస్‌పేట 1,153, చేజర్ల 1,011, మర్రిపాడు 986, సంగం 1,072 గృహాలు చొప్పున ప్రభుత్వం మంజూరు చేసిందని వివరించారు. వివిధ దశల్లో గృహ నిర్మాణాలు ఉన్నాయని తెలిపారు. వాటితో పాటు మరో 1,941 గృహాల మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పేదవాడికి పక్కాఇల్లు నిర్మించి ఇవ్వాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు సమష్టిగా పనిచేసి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలన్నారు. అందుకు సంబంధించి వారం వారం లక్ష్యాలను నిర్దేశించుకుని గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. ఇకపై ప్రతినెలా నియోజకవర్గంలోని అన్ని మండలాల అధికారులతో గృహ నిర్మాణాల పురోగతిపై సమీక్షిస్తామన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో తొలిదశలో 14వేల ఇళ్లు నిర్మించాలని తమ లక్ష్యమని, అందుకు తగిన విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.

ఆరోగ్య ప్రదాత సీఎం వైఎస్ జగన్

• కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా పేదలకు ఇంటి వద్దే కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందిస్తున్న ఆరోగ్య ప్రదాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని వెంగళరావునగర్‌లోని శ్రీపొట్టి శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించి ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్రంలో వైద్యరంగానికి జగనన్న అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేయడంతో పాటు ఆరోగ్యశ్రీ సేవలను విస్తృతం చేసి మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ ఆరోగ్య భరోసా కల్పించే లక్ష్యంతో మరో అడుగు ముందుకేసి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. అందులో భాగంగా రాష్ట్రంలోని ప్రతిఇంటిని వైద్య సిబ్బంది సందర్శించి ప్రాథమిక వైద్యపరీక్షలు చేయడంతో పాటు ఇళ్ల వద్దే స్పెషలిస్టు వైద్యులతో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారని వివరించారు. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ ఏ ముఖ్యమంత్రి ఇలాంటి ఆలోచన చేయలేదన్నారు. అనంతరం ఎమ్మెల్యే రామిరెడ్డి దంపతులు రోగులను పలకరించి వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొందరు అనారోగ్య బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారికి అద్దాలు అందజేశారు. ఆర్డీఓ వీకే శీనానాయక్, మున్సిపల్ కమిషనర్ కిరణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు పందిటి కామరాజు, గంధం ప్రసన్నాంజనేయులు, కనుపర్తి రాజశేఖర్, షేక్ అబ్దుల్లా , పేరం వెంకటేశ్వర్లు, నెల్లూరు వెంకటేశ్వర్లురెడ్డి, కనమర్లపూడి వెంకట నారాయణ, కుందుర్తి శ్రీనివాసులు, షేక్ షాహుల్ హమీద్, నెల్లూరు సీతారావమ్మ, శివరామిరెడ్డి పరుసు మాల్యాద్రి, సైకిల్యాబ్, పూనూరు శివకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



రోగులకు మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

గడప గడపకు సంక్షేమ ఫలాలు



పార్లపల్లిలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న రాజగోపాల్‌రెడ్డి

• ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

కొండాపురం: సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు సంక్షేమ ఫలాలను చేరవేస్తున్నారని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పార్లపల్లి పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. ఎన్నికల హామీలను నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు సీఎం అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ సేవలను నిర్లక్ష్యం చేయగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరోగ్యశ్రీ సేవలను మరింత మెరుగుపరిచారన్నారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేస్తున్నారని వివరించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రజలందరికీ ఆరోగ్య భరోసా కల్పించే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రజలకు ఇంటి వద్దే స్పెషలిస్ట్ వైద్యులతో సేవలు అందిస్తున్నారని వివరించారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాబోయే ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిమ్మిలి రవీంద్ర, సర్పంచ్ పెనుబాకల శైలజ, వైఎస్సార్‌సీపీ నాయకులు పెనుబాకల రవీంద్రరెడ్డి, బొడ్డు మాధవరెడ్డి, పీ కమలాకర్, గంధం ప్రసాద్, బ్రహ్మారెడ్డి, ఎడ్లపల్లి వెంకటరమణయ్య పాల్గొన్నారు.

నిమ్మధరలు (కిలో)
పెద్దవి: రూ. 65
సన్నవి: రూ. 30
పండ్లు: రూ.7

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.138
లేయర్	రూ.118
బ్రాయిలర్ చికెన్:	రూ.238
స్కిన్‌లెస్ చికెన్:	రూ.264
లేయర్ చికెన్:	రూ.200

కార్గో ఆదాయం పెంపునకు సమష్టి కృషి

• పీటీడీ డైరెక్టర్ రాజారెడ్డి

కావలి: ఆర్టీసీ కార్గో ఆదాయాన్ని పెంచేందుకు అధికారులు, సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని ప్రజారవాణా శాఖ(పీటీడీ) డైరెక్టర్ ఏ రాజారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం అయన ఆధ్వర్యంలోని కార్గో అభివృద్ధి కమిటీ కావలి డిపోను సందర్శించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి 51,488 మంది కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చారన్నారు. పీటీడీకి బస్సులు నడపడం ద్వారా వచ్చిన ఆదాయంతో రూ.2,500 కోట్ల అప్పులు తీర్చినట్లు తెలిపారు. కార్గో విభాగంతో పాటు ఇతర వాణిజ్య ఆదాయం ద్వారా వచ్చే మొత్తాన్ని కార్మికుల సంక్షేమానికి వినియోగిస్తున్నామని పేర్కొన్నా రు. కార్గో సేవల ద్వారా 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.250 కోట్ల ఆదాయం రానుందన్నారు. ఈ ఆదాయాన్ని 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.1000 కోట్లకు పెంచేందుకు కార్గో అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసి అన్ని జిల్లాల్లో పర్యటించి వినియోగదారులు, సిబ్బంది సలహాలు తీసుకుంటున్నామని తెలిపారు. కావలి డిపో కార్గో విభాగం పనితీరు బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్గో అభివృద్ధి కమిటీ సభ్యులు గుంటూరు జిల్లా ఏటీఎం సురేష్‌కుమార్, ఏఎం రాజశేఖర్, కావలి డీఎం రాపూరు శ్రీనివాసులు, అసిస్టెంట్ మేనేజర్ కేవీఆర్ బాబు, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డీ రవిప్రకాష్, వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు పీఆర్ ఖాన్, పీ జనార్దన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కావలి బస్టాండ్‌లో కార్గో విభాగాన్ని పరిశీలిస్తున్న డైరెక్టర్ రాజారెడ్డి

డెంగీ, మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి



నిల్వ నీటిని పారబోయిస్తున్న మలేరియా నియంత్రణాధికారిణి హుస్సేనమ్మ

నెల్లూరు సిటీ: డెంగీ, మలేరియా వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా నియంత్రణాధికారిణి హుస్సేనమ్మ సూచించారు. నగరంలోని ఆకుతోట పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. మలేరియా, డెంగీ పరీక్షల నిర్వహణను ల్యాబ్ టెక్నీషియన్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆకుతోట ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'ఫ్రైడే డ్రైడే' కార్యక్రమంలో భాగంగా ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు క్షేత్రస్థాయిలో లార్వా, ఫీవర్ సర్వేలను సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు. ప్రతి ఇంటికి వెళ్లి నిల్వ నీటిని తొలగించి దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శశికళ, కోఆర్డినేటర్ మంజుల, మలేరియా హెల్త్ అసిస్టెంట్ నందకుమార్, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నరసింహకొండ అభివృద్ధికి రూ.52 కోట్లు మంజూరు

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ పరిధిలోని నరసింహకొండ క్షేత్రం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకం ద్వారా రూ.52 కోట్ల మంజూరుకు కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఆమోదం తెలిపారు. ఈ మేరకు శ్రీవేదగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నిధులతో నరసింహకొండకు పర్యాటక శోభను తీసుకొచ్చే దిశగా పలు అభివృద్ధి పనులకు కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు.